క్లుప్తంగా

'మురికి కాలువలు శుభ్రం చేయండి'



డ్రైయినేజీ పరిశీలిస్తున్న ఆనంద్

కెరమెరి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఉన్న మురికి కాలువను శుభ్రం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి కూటికల ఆనంద్ డిమాండ్ చేశారు. మంగళవారం మురికి కాలువలను ఆయన పరిశీలించారు. చెత్తాచెదారంతో నిండి మురికి నాలి దుర్గంధం వెదజల్లుతుందని, అధికారులు వెంటనే మురికి నాలీని శుభ్రం చేయించాలన్నారు. మండలంలోని ఆయా కాలనీల్లోనూ డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల పాటలపై చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే నష్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఆ పాఠశాలకు చెందిన టీచర్లు బాలక్రిష్ణ, నరేశ్, మౌనికను శాలువాలతో సత్కరించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, కడేర్ల రంగయ్య, భాస్కర్ తదితరులు ఉన్నారు.

చేతిపంపు ప్రారంభం



చేతిపంపు ప్రారంభిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజల సౌకర్యం కోసం చేతిపంపు ఏర్పాటు చేసినట్లు మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని రాజుర గ్రామంలో చేతిపంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ దేవత పోచ్చమ్మ ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం చేతిపంపు (బోరింగ్) వేయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి హతం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం సమీపంలో చుక్కలదుప్పిపై మంగళవారం కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి గ్రామ సమీపానికి చుక్కల దుప్పి రావడంతో కుక్కలు దాడి చేయగా, తీవ్రగాయాలై మృతి చెందింది. అధికారులు పోస్టుమార్టం నిర్వహించి పంచనామా చేసి దహనం చేశారు.

శాంతికాలనీలో దొంగతనం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శాంతికాలనీలోని క్వాటర్ నంబర్ 15లో నివాసముంటున్న ఫిరోజ్ ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. ఫిరోజ్ తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లగా, దొంగతనం జరిగింది. ఇంటి తాళాలు పగులగొట్టి రూ. 20 వేల నగదు, అరతులం బంగారం ముక్కుపుడక ఎత్తికెళ్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

తృటిలో తప్పిన ప్రమాదం



డివైడర్ ఎక్కిన లారీ

తాండూర్: మండలంలోని బోయపల్లి వద్ద మంగళవారం జాతీయ రహదారిపై తృటిలో రోడ్డు ప్రమాదం తప్పింది. రోడ్డుపై వెళ్తున్న లారీ ఒక్కసారిగా డివైడర్‌ను, ఆ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉండి డ్రైవింగ్ చేయడం వల్ల లారీ డివైడర్ ఎక్కినట్లు తెలుస్తోంది. తృటిలో ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు కార్పొరేట్ గాలం



తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్ని అప్పులు చేసైనా మంచి కాలేజీల్లో చదివించాలనుకుంటారు. ఉన్నత విద్యకోసం లక్షల రూపాయలు ధారబోస్తారు.. దీన్ని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయి. ముందుగా ప్రవేశాలు పొందితే రాయితీలు కల్పిస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నాయి. – ఆసిఫాబాద్ అర్బన్

- ఫీజులో రాయితీలంటూ వల
- రంగంలోకి పీఆర్‌వోలు, ఏజెంట్లు
- ఇంటర్ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల నిర్వాకం

పదో తరగతి ఫలితాలు రాకముందే విద్యార్థులను తమ కళాశాలల్లో చేర్చుకునేందుకు కార్పొరేట్ కళాశాలలు రంగంలోకి దిగాయి. ఈమేరకు ఆయా కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేకంగా ఏజెంట్లను నియమించుకున్నాయి. తమ పిల్లల జీవితాలను ఉన్నత స్థాయిలో నిలబెట్టేందుకు అప్పు చేసినా సరే మంచి విద్యను అందించాలని తల్లిదండ్రులు ఆశపడుతుంటారు. దీనిని ఆసరాగా చేసుకున్న కార్పొరేట్ కళాశాలలు ఫీజులో రాయితీ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయి. కాగా ఈనెల 2వ తేదీన టెన్త్ పరీక్షలు ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6,560 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

పరీక్షలు ప్రారంభం కాకముందే..

పరీక్షలు ప్రారంభం కాకముందే జిల్లాలో పదో తరగతి విద్యార్థుల అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు, కుటుంబ సభ్యులు కొన్ని ప్రైవేటు కళాశాలల పీఆర్‌వోలు సేకరించారు. గత డిసెంబర్ నుంచే అడ్మిషన్ల ప్రచారాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు నిత్యం ఫోన్‌లు చేస్తున్నారు. అవసరమైతే పాఠశాల యాజమాన్యం నుంచి ఫోన్‌లు చేయించి మాట్లాడిస్తున్నారు. ఫలితాలతో సంబంధం లేకుండానే తాము కళాశాలల్లో చేర్పించుకుంటున్నామని ఒకవేళ పాస్ కాకపోతే డబ్బు వాపస్ తిరిగి ఇస్తామని చెబుతున్నారు. ముందుగా సీటు రిజర్వ్ చేసుకోకపోతే తర్వాత కోరుకున్న బ్రాంచీలో సీటుకు అవకాశం ఉండదని చెబుతున్నారు.

ముందుగా అడ్మిషన్ తీసుకుంటే..

ముందుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఏజెంట్లు, పీఆర్‌వోలు చెబుతున్నారు. కోరిన బ్రాంచీలో సీటు ఇప్పిస్తామని హామీలు ఇస్తున్నారు. పదో తరగతి ఫలితాలు రాకముందే అడ్మిషన్ తీసుకుంటే ఫీజు తక్కువగా ఉంటుందని, తర్వాత పెరుగుతాయని వివరిస్తున్నారు. ఫలితాలు వచ్చాక ఇబ్బందులు పడుతామనే భావనతో కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్‌లు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో గత డిసెంబర్‌లోనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలను పీఆర్‌వోలు తీసుకొని వారి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ముందుగానే సుమారు. రూ.5వేల నుంచి రూ.10వేల వరకు అడ్వాన్స్‌గా ఫీజు తీసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండులు కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని అడ్మిషన్‌లు తీసుకుంటున్నారు. కొన్నిసార్లు హైదరాబాద్, వరంగల్ లాంటి చోట కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్‌లు తీసుకొన్న విద్యార్థులు అక్కడ వసతి, భోజనం, సరిగ్గా లేకపోవడంతో తిరిగి వచ్చిన సందర్భాలు సైతం ఉన్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఇంటర్మీడియెట్ అడ్మిషన్‌లకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రైవేటు కళాశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌లు తీసుకుంటే శాఖాపరమైన చర్యలు ఉంటాయి. విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలి.

– కల్యాణి, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి

ఆర్టీసీ బస్సు ప్రారంభం



బస్సు ప్రారంభిస్తున్న ఎస్సై ఇస్లావత్ నరేశ్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్ గ్రామం నుంచి ఆర్టీసీ బస్సును ఎస్సై ఇస్లావత్ నరేశ్ మంగళవారం ప్రారంభించారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో బాబాపూర్ గ్రామస్తులు ఎస్సై దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. దీంతో కౌటాల, రవీంద్ర నగర్, బాబాపూర్, బూరెపల్లి, కోర్సిని గ్రామాలకు బస్సు సర్వీసు సేవలు కల్పించారు.

చలివేంద్రం ప్రారంభం..

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా చింతలమానెపల్లిలో చలివేంద్రాన్ని కౌటాల సీఐ రమేశ్ ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసవి కాలంలో పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుల్కరి ఉమామహేశ్, నాయకులు భీమేశ్, లోడెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



సామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం పంపిణీ చేసిన వంట సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు అందించిన గంజులు, బకెట్స్, బేషన్స్, గ్యాస్‌స్టవ్ సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు శారద, ఎమ్మార్సీ సిబ్బంది సుమన్, లాలాజీ, బానయ్య ఉన్నారు.

కౌటాలలో గాలి దుమారం

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీగా ఈదురుగాలులు వీచాయి. ఈదురుగాలులతో పాటు చిరుజల్లులు కురిశాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మిర్చి రైతులు కల్లాల్లో మిర్చి కుప్పలపై కవర్లు కప్పేందుకు పరుగులు తీశారు. ఈదురుగాలుల కారణంగా పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

పాఠశాలల్లో యూడైస్ సర్వే



కెరమెరి: సుల్తాన్‌గూడ పాఠశాలలో సర్వే చేస్తున్న ఛాత్రోపాధ్యాయురాలు, సీఆర్‌పీ

ఆసిఫాబాద్‌రూరల్: పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు యూడైస్ సర్వే చేపడుతున్నట్లు ఎంఈవో సుభాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని మోతుగూడ, అప్పపల్లి, బూర్గుడతో పాటు 22 పాఠశాలల్లో ఛాత్రోపాధ్యాయులు సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఏటా యూడైస్ ప్లస్ ప్రధానోపాధ్యాయులు పూర్తి చేసే వారని, వివరాల నమోదులో తప్పులు దొర్లుతున్న నేపథ్యంలో వాస్తవ పరిస్థితులు పరిశీలించేందుకు ఈనెల 15 నుంచి 21 వరకు మండలంలోని 70 పాఠశాలలో సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు, సీఆర్‌పీ తిరుపతి, నగేశ్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: యూడైస్‌లో ఉన్న తప్పొప్పులను సరిచేసే ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. మండలంలోని పది పాఠశాలల్లో బీఎడ్, డీఎడ్ కళాశాలల విద్యార్థులు ఎంపిక చేసిన పాఠశాలలకు వెళ్లి స్కూల్ రిపోర్టుకార్డులో ఉన్న డేటాను రిజిస్టర్‌లో ఉన్న డేటాను పరిశీలించారు. ఏవైనా వ్యత్యాసాలుంటే అప్పటికప్పుడే యూడైస్ పోర్టల్‌లో సరిచేసి అప్‌లోడ్ చేశారు. మండలంలోని ఐదుగురు ఛాత్రోపాధ్యాయులు ఆయా పాఠశాలలను సందర్శించగా.. వారికి సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీసీవో సహకారమందించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్ దిశానిర్దేశం చేశారు.

క్షేత్రస్థాయిలో సర్వే

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని పాఠశాలల్లో మౌలిక వసతులపై ట్రెయినీ టీచర్లు, సీఆర్‌పీలతో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించనున్నట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ట్రెయినీ టీచర్లు, సీఆర్‌పీలతో ఎంఈవో కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూడైస్ ప్లస్‌పై థర్డ్ పార్టీ బీఈడీ కళాశాల ట్రెయినీ టీచర్లు, సీఆర్‌పీలతో ఈనెల 21 వరకు సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని 94 పాఠశాలల్లో ఈ సర్వే జరుగుతుందని, పాఠశాలల భౌతిక వివరాలు పరిశీలించి నివేదికలు సమర్పిస్తారని తెలిపారు. జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ అబీద్ అలీ మాట్లాడుతూ గతంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యుడైస్ ప్లస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పాఠశాల వివరాలను భౌతికంగా పరిశీలన చేసి ఏమైనా పొరపాట్లు ఉంటే అప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు, ట్రెయినీ టీచర్లు పాల్గొన్నారు.

బడులకు కొత్త వంటపాత్రలు



పాఠశాలలకు వంటపాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో ప్రకాశ్

- మధ్యాహ్న భోజనానికి కొత్త సామగ్రి
- పాత సామగ్రికి చెల్లు
- గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు

కెరమెరి: ఎప్పుడెప్పుడా అని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఎదురుచూస్తున్న వంట పాత్రలు రానే వచ్చాయి. గత కొంత కాలంగా నిర్వాహకులు వంట పాత్రలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో నిర్వాహకులు తమ ఇంటి వంట పాత్రల్లో వంటలు చేస్తుండగా, మరికొన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ సొంత డబ్బులతో వంట పాత్రలు కొనుగోలు చేసి ఇచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యావ్యవస్థను సమూలంగా మార్చుదిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో క్రమక్రమంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తీర్చేందుకు నడుం బిగించింది. గత కొద్ది నెలల క్రితం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించింది. గదులు పైకప్పులు, స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం, కిటికీలు, తలుపులు మరమ్మతులు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు అమర్చడం, తాగునీటి సౌకర్యం వంటివి కల్పించింది. ప్రస్తుతం వంట పాత్రలు మంజూరు చేయడంతో నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 87 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కొనసాగుతుండగా.. 36 పాఠశాలలకు వంటపాత్రలు మంజూరయ్యాయి. వీటిని మంగళవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో దించగా వెంటనే ఎంఈవో ఆడే ప్రకాశ్ హెచ్‌ఎంతో పాటు ఎండీఎం కార్మికులకు అందించారు.

వంటపాత్రలు మంజూరు..

విద్యార్థులకు పోషకాహారం అందించడమే మధ్యాహ్న భోజన లక్ష్యం. ఇందులో భాగంగానే ప్రభుత్వం ఆయా బడులకు వంటపాత్రలు మంజూరు చేయగా మంగళవారం కెరమెరి మండలానికి వంటపాత్రలు చేరాయి. కొన్ని పాఠశాలల్లోని పాత పాత్రల్లో చేస్తున్న వంటకాలు ఒక్కోసారి నాణ్యతగా ఉండడం లేదు. గత ప్రభుత్వ హయాంలో వంటపాత్రలు లేక నిర్వాహకులు అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వానికి ఎండీఎం కార్మికులు నివేదనలు సమర్పించారు. దీంతో గతంలో వంట పాత్రలు కొనుగోలు చేసేందుకు నిధులు విడుదల చేస్తామని గతంలో ప్రకటించారు.

సద్వినియోగం చేసుకోవాలి



గత కొంత కాలం నుంచి వంట సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకుల కష్టాలు దూరమయ్యాయి. మండలంలోని 36 పాఠశాలలకు వంట సామగ్రి మంజూరైంది. వీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. వంటలు చేసిన తర్వాత శుభ్రం చేసి భద్రపర్చుకోవాలి.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

యువకులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ

తిర్యాణి: యువకులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సీఐ బుద్దె స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రోంపెల్లి గ్రామంలో వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు ఆత్రం గణేశ్ స్మారకార్థం నిర్వహిస్తున్నా వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఏర్పర్చుకున్నా లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. వాలీబాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మైలారం శ్రీనివాస్, పీజీ హెచ్‌ఎంలు నైతం కృష్ణారావు, మడావి గోపాల్, పీడీలు మడావి శేకు, గుండం లక్ష్మణ్, పెందూర్ సుభాశ్, కుర్సెంగ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోషకాహారం ఆరోగ్యానికి మేలు



కమ్మర్‌గాంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెంచికల్‌పేట్: పోషకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా అన్నారు. పోషణ్ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కమ్మర్‌గాం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ప్రతీరోజు తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేశారు. పోషకాహార లోపంతో కలిగే నష్టాలను వివరించారు. అంతకుముందు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మహిళలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో దోహద పడుతుందని ఎస్సై ప్రవీణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో బెజ్జూర్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు పులురు సతీశ్ కుమార్, రేణిగుంట్ల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రంలో వసతులు కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలోని మీసేవ కేంద్రంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే కనీస వసతులు కల్పించాలని సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం పేర్కొన్నారు. ప్రతీరోజు వందలాది మంది వినియోగదారులు తమ పనులకు వస్తుంటారని, తాగడానికి మంచినీరు కూడా లేదని, వేసవి వేడిని తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వెంటనే కూలర్లు, చల్లని మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ఇంద్రవెల్లి: మండలంలోని పాటగూడ(కే) గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం తెలిపారు. మండలంలోని పాటగూడ(కే) గ్రామంలో పైప్‌లైన్ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని సమాక పంచాయతీ పరిధిలోని పాటగూడ(కే) గ్రామానికి శాశ్వతంగా నీటిని సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పైప్‌లైన్ నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ.8 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండీ జహీర్, కొడప శ్రీకాంత్, నాయకులు మారుతి, మాణిక్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఇచ్చోడ: తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని అక్కడి కాలనీవాసుల విన్నపం మేరకు నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ, పంచాయతీ ఈవోలకు సూచించారు. మండలంలో తాగునీటి సమస్య ఉంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఏఈ, మేజర్ పంచాయతీ ఈవో, కార్యదర్శులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంపులతో తాగునీటి సమస్య దూరం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని మాదారం టౌన్‌షిప్‌లో నెలకొన్న తాగునీటి సమస్యకు నూతనంగా రూ. 23 లక్షలతో కొత్తగా కొనుగోలు చేసిన పంపులతో సమస్య పరిష్కారం కానుందని ఏఐటీయూసీ జీఎం కమిటీ సభ్యులు శేషశయనరావు, జగ్గయ్య, ఆనంద్, రాజేశ్‌లు మంగళవారం తెలిపారు. మాదారం టౌన్‌షిప్‌లో పాత పంపులు తరుచూ చెడిపోయి సింగరేణి క్వాటర్లకు తాగునీటి సరఫరాలో అనేక ఇబ్బందులు ఏర్పడటంతో గత నెల యాజమాన్యంతో ఏఐటీయూసీ జరిపిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి యాజమాన్యాన్ని కోరారన్నారు. దాంతో స్పందించిన యాజమాన్యం రూ. 23 లక్షలతో కొత్త పంపులను కొనుగోలు చేసిందని త్వరలోనే వాటిని బిగించి కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపేలా సింగరేణి అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.